కథానిక

# తోడేళ్ళ గోత్రాలు

"వల్లపురెడ్డి"

సాయంత్రం భోంచేసేవరకే కొంచం చీకటి పడింది. ఒక మిత్రుణ్ణి చూట్టానికి వెళ్ళాల్సి వుండింది. డబుల్ డెక్కరుబస్సు ఎక్కాను. ఒక స్టేజ్ దగ్గర బస్సు ఆగింది. తీరిగ్గా సిగరెట్టుముట్టించి పీలుస్తూ కూర్చుంటే ఒకవిధమైన మగత క్రమ్మింది. ఆ మత్తులో ఎంతసేపు నన్ను నేను మరిచానో తెలుపలేను. కాని తీరా చూద్దునుగదా! ముట్టించిన సిగరెట్టు సగంపైగానే కాలింది. కనీసం రెండునిముషాలవుతుంది. ఎక్కడ ఆగినా, బస్సు అర్థనిముషంకంటే ఎక్కువ ఆగనేఆగదు. మహా అయితే ఒక్క నిముషం. అంతే. కాని నేను వెలిగించిన సిగరెట్టు సగంపైగా కాలినా ఇంకా బస్సు నిలబడిన చోటే వుంది. కారణమేమిటా అని బస్సంతా కలియచూసేటప్పటికి అందరూ తలలు కిటికీల ద్వారా బయటికి నిక్కించి చూస్తున్నారు. ఏదో గలాటా జరిగుంటుందని నేనూ క్రిందకి చూశాను బస్సు రెండో అంతస్తునుండి.

చాలామంది మూగి ఉన్నారు. వారిలో కొందరు నేను కూర్చునివున్న బస్సు ప్రయాణీకులున్నా, మిగతావారు రోడ్డుపై యాతాయాత సందోహం. ఆ మూకకు మధ్య ఒక్కడుమాత్రం పెద్దగొంతుతో దీనంగా వేడుకుంటున్నాడు కండక్టరును "ఫిర్ కభీ నహీ కరూంగా సాబ్, ఛోడ్ దో సాబ్, ఆప్కే పావూఁ పడూంగా" అంటూ. కాని కండక్టరుమాత్రం వాడిని విడువటం లేదు. పట్టి లాగుతున్నాడు. నోటికొచ్చినట్లల్లా తిడుతున్నాడు.

ఆ ఏడుస్తూన్నవాడు ఎవడో టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తున్నవాడేమో అనుకున్నా. కాని ఏదో మూడు నాల్గణాల టికెట్టుకు యింత రభస ఎందుకు జరుగుతుంది అని వెంటనే ఆలోచించా. "ఏమిటి? ఏం జరిగింది?" అని నాకంటే ముందునుంచి చూస్తున్నవాళ్లగూడా నన్నే ప్రశ్నించారు. నేను వాళ్ళకు ఇదమిత్థమని సమాధానం చెప్పలేదు. ఆ దృశ్యం ఏమిటో నాకర్థమయితేగా చెప్పటానికి?

ఇద్దరు కండక్టర్లూ, ఒక డ్రైవరు, ముగ్గురూ వాడిపాలిట యమదూతల్లా ఉన్నారు. ఒక కండక్టరూ ఒక డ్రైవరూ ఇంకో కండక్టరుని ప్రోత్సహిస్తున్నారు, "ఖీంచ్ లావో, బస్ మే డాల్దో హరామ్‌కు" అని. వాడిని పట్టి లాగుతున్న కండక్టరు ప్రళయరుద్రునిలా ఉగ్రుడై పండ్లు పటపట కొరుకుతున్నాడు. జనమంతా మూగి మూకగా నిల్చుంది. ఒక్కడు కూడా "పాపం! విడిచిపెట్టండి" అని కండక్టరుకు చెప్పటం గాని, లేక "బద్మాషుని పట్టుకుని ఎముకలు విరగగొట్టండి" అని కండక్టరుకు పురెక్కించటంగాని చేయలేకపోతున్నారు. నలుగురు మూగినచోట కొందరు అనుకూలంగా, మరికొందరు ప్రతికూలంగా ఉండటం సహజం. కాని అక్కడమాత్రం ఆ చిహ్నలేమీ గోచరించకపోయేటప్పటికి నాకాశ్చర్యమే వేసింది.

దీనంగా ఏడుస్తూన్న వ్యక్తి నేరస్థుడే అని నాకు మొదటనే తేలిపోయింది. వాడు కొద్ది పుష్టిగలవాడే కావున కండక్టరు ఎంత లాగినా రావటంలేదు. అక్కడ ప్రయాణీకుల నీడకై వేసిన షెడ్ యొక్క ఊచల్ని పట్టుకుని "రానంటే రా"నంటూ మారాం చేస్తున్నాడు. వాడు ఎంతకూ లొంగకపోయేసరికి కండక్టరు నిప్పులు త్రొక్కాడు. కళ్ళల్లో రక్తం కారుస్తూ వాడి చెంప చెళ్ళు మనిపించాడు. దానితో వాని రోదన ఆకాశాన్ని ముట్టింది. కాని ఎవరు వింటారు? అంతమందిలో వున్నా, వాడి గోడు అరణ్య రోదనమయింది.

అంతవరకు ఊరికే నిల్చుని ప్రోత్సహిస్తూన్న మిగతా ఇద్దరు బస్సువాళ్ళూ చేయిచేసుకున్నారు. బలంకొద్దీ వాడిని లాగారు. వాడు ఈడగిలబడి మరీమరీ అడుక్కుంటున్నాడు తనను విడిచిపుచ్చమని.

రెండు కళ్ళుండీ, జరుగుతూన్న దృశ్యాన్ని చూస్తూ కూడా నన్ను "ఏమిటి? ఏం జరిగింది?" అని గ్రుడ్డివాళ్ళలాగు ప్రశ్నించే తోటి ప్రయాణీకుల బాధపడలేక ఏమిటో కాస్త కనుక్కుందామని క్రిందికి దిగాను. బస్సు ద్వారానికి అడ్డంగానిలుచుని తమాషా చూస్తున్నవాళ్ళు నాకు చోటివ్వలేదు.

"ఏమిచేశాడు వాడు?" అని నా కడ్డంగానిల్చుని ఉన్న ఒక వ్యక్తిని ప్రశ్నించాను, దిగటానికి వీల్లేక.

"పిక్ పాకెట్" అన్నాడతడు. జేబుదొంగతనం చేశాడని తెలుగులో చెప్పటం నామోషి అనుకున్నాడేమో! లేకపోతే, నేను వేసుకున్న ఇంగ్లీషువాళ్ల నమూనా దుస్తులు అతన్ని అలా ప్రోత్సహించాయో తెలీదు. ఎంతైనా వాడు జేబుదొంగ అని తేలాక నాకూ కోపమేవచ్చింది.

వాని ఏడుపు భరించలేకనేమో ఆఖరుకు తలో నాలుగు తన్నులు బూట్లకాళ్ళతో మెత్తగా తన్ని విడిచి విచ్చారు. ఇంకో వింతేమిటంటే ఈ భారతం జరిగేచోట ఒక పోలీసుగూడ ఉన్నాడు. అతడు కూడా చూస్తూ నిలబడ్డాడేగాని ఏమీ జోక్యం కలిగించుకోలేదు.

అందరూ ఎవరి సీట్లలో వాళ్లు కూర్చున్నారు. బస్సు కదలటానికి గంట మ్రోగింది క్రిందిభాగంలో. మా భాగానికివున్న కండక్టరు వచ్చాడు పైకి. అతనితోబాటు ఆ 'రక్షక భటుడు' కూడవచ్చాడు.

"తుమ్ క్యా కర్ రహేథే జీ?" అని ప్రశ్నించాడొక యువకప్రయాణీకుడా రక్షక భటుడిని; నేరస్తునిపై కారాలు నూరుతూ.

"మేరా సికింద్రాబాద్ సే తాలూక్ హై." అన్నాడతడు నిర్లక్ష్యంగా. రక్షకభటసంస్థ శాసనాలలో అంతేయుందేమో. అతనికి సికింద్రాబాదులో జరిగే అన్యాయాలపైనే చర్యదీసుకోమన్నారేమో అధికారులు. ఇక ఎక్కడ ఎంత ఘోర కృత్యం జరుగుతున్నా కళ్ళుమూసుకోమని నిర్దేశించారేమో! ఎంతైనా వాళ్ళకు కావలసింది మొదటితారీకురాగానే వచ్చే కాగితాలు! అంతే కాని ఎవరేమైపోతే వాళ్ళకేమిటి?

"వాడిని మీరెట్లా పట్టుకున్నారు?" అని అడిగాడింకొక ప్రయాణీకుడు కండక్టరును.

ప్రక్కనేయున్న ఒకాయనదగ్గర టికెట్టుకు డబ్బులు తీసుకుంటూ ఉపన్యాసం గంభీరంగా మొదలెట్టాడు. "అసలు ఈ జేబుదొంగల జట్టు ఒకటుంది. వీళ్ళు అంతా అయిదారుగురున్నారు. ఎక్కడ, ఏ బస్సులోచూచినా వీళ్లే ప్రత్యక్షం. ముఖ్యంగా బస్సులో ప్రయాణం చేసేవాళ్ళకు జాగ్రత అంటే తెలియదండీ. ఏ పల్లెటూళ్ళనుంచి వస్తారో తెలీదు. ప్రక్కన కూర్చున్న వ్యక్తి ఎలాంటివాళ్ళో చూడకుండానే మా కివ్వాల్సింది అణా, రెండణాలయినా పదిరూపాయ నోట్లూ, నూరురూపాయలనోట్లూ బయటికి తీస్తారు జేబుల్లోంచి. మళ్ళీ వాటిని భద్రంగానైనా పెట్టుకోరు. పై జేబులోనే బయటికి కనపడేలా పెట్టుకుంటారు. ఎవడైనా అదృష్టం బావున్నవాడికంట్లో పడినాయంటే సరి; తరువాత చేతులు వెల్లకిలవేసి లబోదిబోమని మొత్తుకుంటారు. చేయిదాటిం తరువాత ఏం సాధ్యమవుతుంది?"

కండక్టరు ఉపన్యాసానికి అందరూ చకితులై నోళ్ళుతెరచి వింటున్నారు. టికట్టుకు డబ్బులిచ్చినాయన కూడా వాళ్ళలో చేరిపోయాడు.

"అయితే మరి ఇప్పటివాడినెలా కనుక్కున్నారు" అతఃపూర్వం పృచ్ఛించినాయనే అడిగాడు.

"వీడినా? బస్సుదిగుతూ మరొకాయన జేబులో బయటికి కొంచెంగా అగుపడుతూన్న పర్సు దొంగలించటానికి ప్రయత్నించాడు. జేబులోకి లిన్నగా చెయి జొరుపుతూంటే చూసి పట్టుకున్నా." అన్నాడు. కండక్టరు తెలివికి, మంచితనానికి అందరూ తలలూపినట్లే ఉంది.

మరోస్టేజి దగ్గర బస్సు ఆగింది. కొందరు లేచారు దిగటానికి. టికట్టుకై డబ్బులిచ్చినాయన కూడా దిగటానికి లేస్తూ 'టికెట్లు సార్' అని చెయి చాపాడు.

"ఊఁ! దిగుదిగు." అని త్రోశాడు టికెట్టివ్వకుండానే. అతడేదో అమాయకుడు కనుక, బస్సుదిగి చక్కా వెళ్ళిపోయాడు. ఏరంతూ లేకపోయింది.

కండక్టరుయొక్క యీ చర్యచూసిన వాళ్లు ఏమీ మార్పురానీయలేదు తమ ముఖకవళికల్లో. అతడు ప్రయాణీకునికి చేసిన అన్యాయమేమీ లేదు; కాని ప్రభుత్వానికి మాత్రం ద్రోహమే చేశాడు. ప్రభుత్వం చట్టప్రకారం న్యాయసంబద్ధమైన జీతంఇచ్చి ఆయన్ని పోషిస్తూంది. అందుకతడు తన విధిని సక్రమంగా నిర్వర్తించాలి, కాని

అతడు త్రొక్కింది పెడత్రోవే. జేబుదొంగల విషయంలో అంతా సమంజసంగానే చెప్పాడు. కాని తానుమాత్రం నిజాయితీకి విరుద్ధంగా చరించి, పప్పులో కాలువేశాడు.

* * *

తరువాత కొన్ని మాసాల సంగతి. మా ఆఫీసులో కొన్ని ఉద్యోగాలు ఖాళీ అయినయి. ఖాళీస్థలాలు మూడేఅయినా, అభ్యర్థి పత్రాలు మాత్రం మూడు వందలపైగా చేరినయి. ఒకతేదీన అందరికీ ఇంటర్వ్యూ పెట్టాము.

ఆ డిపార్టుమెంటుకు నేనే పెద్ద అధికారిని కనుక ఒక్కొక్కరినే పిలిపించాను. ప్రతివాడికీ ఉన్న క్వాలిఫికేషనులను, సర్వీసును (అనుభవాన్ని), నడవడి పత్రాల్నిచూచీ ఆయాపదవులకి తగుదురా లేదా అని నిర్ణయించాల్సింది నేను. అందరూ వికసించిన ముఖాలతో, ఏవో ఆశలతో వస్తారు. తమ గోడవలు నా ప్రశ్నలకు సమాధానాలుగా చెప్పి వెళ్ళిపోతారు.

'ధర్మయ్య, ఎం. ఏ.' అని ప్యూన్‌తో చెప్పి పంపాను. ఒకవ్యక్తిని తీసుకొచ్చాడు. ఆవ్యక్తిని చూడ్డంతోనే నా కళ్లపై నాకే అనుమానం కలిగింది. అతఁడానాడు, కొన్ని మాసాల క్రితం బస్సువాళ్లచే జేబుదొంగ నేరంపైన బూట్లతన్నులు తిన్న మనిషే! ప్రజ్ఞాపత్రాల్ని అటూ ఇటూ చూశాను. అనుమానం ఏమీకలగలేదు. కళాశాల నడవడిపత్రం తప్ప ఏవిధమైన సిఫారసుపత్రాలు లేవు. మాదగ్గరున్న పనికి తగినవాడే అయినా నాకెందుకో అతణ్ణి నియమించ మనస్సొప్పలా. కారణం?

"ఇది చాలా బాధ్యతగల పని. దీనికి ఆర్థిక స్తోమత ఏరూపంగానైనా ఉన్నవారే సమర్థులు. నీకెంత ఆదాయం ఉంది? ఆస్తిఅంతా ఎంతవిలువ చేస్తుంది?" అని ప్రశ్నించాను అందర్ని ప్రశ్నించినట్లే.

అతఁడు నిరుత్తరుఁడై నిలుచున్నాడు. పాపం! కళ్ళలో నీళ్ళు క్రుక్కుకుంటున్నాడు.

"వెళ్ళండి." అన్నాను అధికారరీత్యా.

అతడు భారమైన అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతూంటే "ఇటురండి" అని పిల్చాను.

చిరునవ్వును ఎరువు తెచ్చిపెట్టుకుంటువచ్చాడు.

"సాయంత్రం ఐదుగంటలకు ఈ విలాసానికి వచ్చి నన్ను కలుసుకో" అని ఒక కార్డు నా అడ్రసు ఉన్నది ఇచ్చాను. అతఁడు 'సరే' నంటూ వెళ్ళిపోయాడు.

తరువాత ఎవరో ముగ్గురు, అర్హతగలవారు నియమింపఁబడ్డారు.

ఆనాఁడు అయిదుగంటల కతఁడొచ్చాడు. నమస్కరించటంతోనే కూర్చోమనిచెప్పాను. "ఏమండీ, రమ్మన్నా రెందుకు?" అని అడిగాడు వినయంగా.

"ఏంచేస్తున్నారు మీరు?"

"నిరుద్యోగం."

"మరి నేనొక విషయం అడుగుతాను. ఏమీ అనుకోరుగదా?" అన్నాను. అతఁడు కొంచెం గాబరాపడ్డాడు.

"అడగండి." అన్నాడు భయంగా.

"ఆనాడు జేబు దొంగతనం ఫలితంగా బస్సువాళ్ళతో..." అంటూంటే అతనితల అకస్మాత్తుగా దిగిపోయింది. కళ్ళలోనుంచి అశ్రువులు రాలాయి. అతని పశ్చాత్తాపానికి నాకే జాలివేసింది. "మరేం ఫరవాలేదు. కొంచెం నీ గాథచెప్పు." అన్నాను.

కన్నీళ్ళు తుడుచుకుంటూ పోడిపోతూన్న గొంతుతో మొదలుపెట్టాడు, "చదువువల్ల సాధించేది చాలా ఉందనే ఆశలతో ఉన్న ఆస్తినంతా అడుగంటించాను. తీరా ఎమ్మే ప్యాసయేసరికి చేతిలో చిల్లిగవ్వయినాలేదు. అప్పటికే భార్య, ఇద్దరుపిల్లలు. మిగిలిన చిన్న ఇల్లు కాస్తా అమ్మి ఉద్యోగం కొఱకు భార్యాపిల్లల్తో బస్తీకివచ్చాను. వచ్చినప్పటినుంచీ అన్ని ఆఫీసులూ తిరిగాను కాళ్ళరిగిపోయేట్లు. కాని ఫలితం శూన్యమయింది. డబ్బంతా అయిపోయింది. రోజు గడపటమే గండంగా మారింది. పిల్లలు..." గొంతు గద్గదిక వహించి చెప్పలేక పోయాడు.

మంచినీళ్లు తెప్పించి ఇస్తే, త్రాగి "పిల్లలు జబ్బుపడ్డారు. నా చేతగానితనానికి భార్య చీవాట్లు పడలేకపోయాను; జేబులు కొడుతూంటే ఎందరినో చూశా. అంతరాత్మ ఇష్టపడకపోయినా ఆనాఁడా పనిచేయటానికి ప్రయత్నించా. ప్రావీణ్యం లేకపోవటం మూలాన తన్నులు తప్పలేదు." అంటూ కంటనీరు పెట్టి మరేమీ చెప్పలేదు.

"ఆ తరువాత ఎట్లాగడిచింది?" అని అడిగాను.

"ఇక ఆ పని చేయదలంచలేదు. ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోలేదు. కాయకష్టం

చేయాలన్నా ఎక్కడా పని దొరకటమే కష్టమయింది. కళ్ళున్నవాళ్ళు గుడ్డివాళ్ళలాగు, కాళ్ళున్నవాళ్ళు కుంటివాళ్ళలాగు, నోరున్నవాళ్ళు మూగవాళ్ళలాగు నటిస్తూ తమజీవనాన్ని సాగించే వాళ్ళను చూడటం తటస్థించింది. ఆఁ! బ్రతుకును పోషించాలంటే అదీ ఒక మార్గమే ననుకున్నా. ఆ నాటినుండీ నేనే ఒక బజారులో కుంటివాణ్ణవుతాను. ఇంకో బజారులో మూగవాణ్ణి, మరో బజారులో గ్రుడ్డివాణ్ణవుతాను. వచ్చిపోయేవాళ్ళను యాచించి ఎట్లాగో మమ్ము మేము పోషించుకుంటున్నాం. ఎక్కడ ఏసీటు ఖాళీఅయినా అప్లికేషను పెడతాను. ఎమ్మేలో కట్టించుకున్న ఈ దుస్తుల్ని జాగ్రత్తపరచి ఇంటర్వ్యూలకు వెడుతుంటాను. ఇదీ నాగాథ" అంటూ భారమైన వేడి నిట్టూర్పొకటి విడిచాడు.

అతని స్థితిపై జాలికలిగింది. మా ఆఫీసులో ఉన్న ఉద్యోగాలకు అతడేవిధంగానూ అర్హుడు కాడు. నేను జమానతు పడతామంటే అదీవీల్లేదు. అందరూ ఆడిపోస్తారు నన్ను, నాకు ఆత్మీయుడైన ఎవడికో ఉద్యోగమిచ్చానని.

"అయితే మా పిల్లలకు ట్యూషన్ చెబుతారూ?" ప్రశ్నించాను ఎట్లాగూ అతనికో మార్గం కల్పించాలని. అతఁడు సమ్మతంగా తల ఊపాడు.

"జీతం ఎంత ఇవ్వాలంటారు?"

"మీ ఇష్టం."

మా ఇంట్లో రెండు గదులు ఇచ్చి, ఆయన్ని భార్యాపిల్లలతో రమ్మన్నాను. అతఁడూ వచ్చాడు. నేను ఇచ్చింది కొద్దిపాటి జీతమైనా చాలా సామాన్యమైన వ్యయంతో గడుపుతున్నారు. ఎక్కడేనా మళ్ళీ ఉద్యోగానికై ఖాళీలుఉంటే అర్జీ దాఖలు చెయ్యమన్నాను.

మళ్ళీ ఒకనాడు బస్సులో పనిమీద ఎక్కడికో వెడుతున్నా. ఖర్మంకాలి ఆ కండక్టరే ప్రత్యక్షమయ్యాడక్కడ. నేను చూస్తూండగానే అందరి దగ్గరా డబ్బులు వసూలుచేసుకున్నాడు. తన అలవాటుమాత్రం పోనీలా. కొందరికి టికెట్లివ్వలేదు. అక్కడక్కడ స్టేజిలలో కొందరు దిగారు.

ఒక స్టేజిదగ్గర టికెట్ చెక్కర్ అకస్మాత్తుగా వచ్చాడు. అందరిదగ్గరా టికెట్లు పరీక్షించాడు. ఒక్కడు టికెట్టులేకుండా దొరికాడు. "ఎందుకు తీసుకోలేదు టికట్ట"ని అడిగితే అతడు "డబ్బులు కండక్టరుకు ఇచ్చాను కాని అతడు టికెట్టివ్వలేద"న్నాడు. కండక్టరు ప్లేటుమార్చాడు. "దొంగతనంగా ఎక్కాడు నేను చూడ్నే లేదు" అన్నాడు. ఎంత వాదంజరిగినా లాభంలేకపోయింది. శాసనం ప్రకారం టికెట్టులేకుండా ప్రయాణించినందుకు పదిరూపాయిలు జరిమానా విధించారు. కండక్టరు మాత్రం సేఫ్.

ఇదంతా చూసి నాకు కలిగిన బాధ అంతా ఇంతా అని చెప్పటానికి వీల్లేదు. జేబులుకొట్టి బ్రతుకుతూన్న వాడికంటే ఇతని పని ఏమంత పవిత్రమైందని? అంతకంటే హీనమైంది కాదూ? అనాడతడ్ని బూట్లకాళ్ళతో తన్నాడే! మరీనాడితని నేరానికి ఏం శిక్ష! వస్తూన్న జీతంతో తృప్తిపడలేదు. తను చేసిన తప్పును అమాయకునిపై మోపి వాడికి పదిరూపాయలు దండుగ పెట్టించాడే!

ఇంత పెద్ద ఉద్యోగిని, అంత అన్యాయం కళ్లెదుట జరుగుతూంటే ఎలాసహించానని ప్రశ్నిస్తారా!

ఎప్పుడో హైస్కూల్లో చదువుతూన్నప్పుడు మా ప్రధానోపాధ్యాయులు చెప్పారొక సంగతి. ఆ బస్తీలో ఉన్న బస్సువాళ్లతో టికెట్టు ఇవ్వక డబ్బులుమాత్రమే తీసుకున్నందుకు పోట్లాడాను. ఆసంగతి మా హెడ్మాష్టరుదాకా ప్రాకిపోయింది. ఆయన నన్ను పిలిచి అన్నారు "నీవు రోజూ బడికి సక్రమంగా ఒక్కనిముషం లేటుగాకండావస్తావా!

"రోజు పాఠాలు రోజూ చదువుతావా? ఇదే నీ తప్పు. నీ పనుల్ని విధిగా నిర్వర్తించనంతవరకు నీకుగాని, ఇతరులకుగాని జరిగే అన్యాయాన్ని గూర్చి నాలుకాడించటానికి ఏమాత్రం వీల్లే"దన్నారు.

ఆమాటే నన్నీనాడు ఈ అక్రమాన్నెదురుకోకండాజేసింది. ఇప్పటికీ నేను ఆఫీసుకు లేటుగా పోతానొక్కొక్కప్పుడు. తల భారంగా ఉందని, చుట్టాలొచ్చారని ఒక్కొక్కరోజు సెలవు పెడతా. నా పనులయెడ వైముఖ్యం ఇంకా తొలగలేదు కనుక ఏమీ అనలేకపోయాను.

నిజానికి ధర్మయ్యా, కండక్టరు ఇరువురూ నేరస్థులే. కాని ఎవరెక్కువ నేరంచేశారో నిర్ణయించటం ఎవరివంతు? ఎవరిది మహాపరాధం? ఎవరు క్షంతవ్యులు?

★